క్లుప్తంగా

పారిశుధ్యానికి ప్రజలు సహకరించాలి


మాట్లాడుతున్న డీఆర్డీఓ శ్రీలత

మానకొండూర్‌రూరల్‌: పారిశుద్యం, స్వచ్ఛ సాధనకు ప్రజలు సహకరించాలని, ప్రవర్తనలో మార్పు రావాలని డీఆర్‌డీవో శ్రీలత అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం పారిశ్యుధ్యంపై సమావేశం నిర్వహించారు. సమావేశంలో శ్రీలత మాట్లాడుతూ.. తడి, పొడిచెత్త వేరుచేయడం, మురుగునీటి నిర్వహణ, మరుగుదొడ్ల సద్వినియోగం, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాల్లో ప్రజల్లో మార్పు రావాలన్నారు. మహిళా సంఘాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాకార్యకర్తలు స్పందన తీసుకువచ్చేలా కృషిచేయాలన్నారు. మండలంలోని అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులు అవగాహన కల్పించాలని, పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, ఎంపీవో రాజేశ్వర్‌రావు, సర్పంచ్‌ పృథ్వీరాజ్‌, ఏపీఎం సంతోష్‌, నిరంజన్‌, ఏపీవో శ్రీనివాస్‌, యునిసెఫ్‌ సమన్వయ కర్త కిషన్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

వీణవంక: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హుజూరాబాద్‌ ఏసీపీ జీవన్‌రెడ్డి అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో అపరిచితులు కనిపిస్తే డయల్‌ 100 సమాచారం ఇవ్వాలని సూచించారు. నేరాల నియంత్రణకు ప్రజలు సహకరించాలని అన్నారు. వెంట ఎస్సై ఆసిఫ్‌, సిబ్బంది ఉన్నారు.

నులిపురుగుల నివారణపై అవగాహన


హాజరైన ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది

శంకరపట్నం: మండల పరిషత్‌ కార్యాలయంలో మంగళవారం నులిపురుగుల నివారణపై ఎంఈవో నర్సింహారెడ్డి అవగాహన సదస్సు నిర్వహించారు. 19ఏళ్లలోపు పిల్లలకు ఆల్బెండజోల్‌ మాత్రలు వేయాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్‌ పాఠశాలల విద్యార్థులకు తప్పనిసరిగా వేయాలన్నారు. మండలంలో 6,518 మంది పిల్లలు ఉన్నట్లు గుర్తించామన్నారు. సమావేశంలో వైద్యాధికారి వేణుగోపాల్‌, సంజీవరెడ్డి, ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

రాజకీయ పబ్బం కోసమే ఆరోపణలు


మాట్లాడుతున్న సర్పంచ్‌ కోల రమేశ్‌

రామడుగు: రాజకీయ పబ్బం కోసమే శిలాఫలకాలను తొలగించారని మాజీ సర్పంచ్‌ ఎల్కపల్లి దేవమ్మ ఆరోపణలు చేస్తున్నారని దేశరాజ్‌పల్లి సర్పంచ్‌ కోల రమేశ్‌ అన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. గ్రామాభివృద్ధికి పార్టీలకు అతీతంగా అందరూ కలిసి కట్టుగా కృషి చేస్తున్నామని, శిలాఫలాకాలను ధ్వంసం చేశామనే దానిపై బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని, గ్రామాభివృద్ధి కార్యక్రమాలు గ్రామసభల ద్వారా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సమావేశంలో ఉపసర్పంచ్‌ రత్నాకర్‌రెడ్డి, వార్డు సభ్యులు హరిత, ఎల్లేష్‌కుమార్‌, ప్రమీల, పోచమ్మ, లక్ష్మీ, గీతా, ఐలయ్య, నాగమ్మ, తిరుపతి, ఆంజనేయులు పాల్గొన్నారు.

విలీనమైనా సమస్యలే..!

- జమ్మికుంట మున్సిపల్‌ పరిధి కొత్తపల్లి నాలుగో వార్డులో డ్రైనేజీలు లేక ప్రజల ఇక్కట్లు
- పడకేసిన పారిశుధ్యం, శ్మశానవాటిక నిర్మించినా ప్రహరీ, విద్యుత్‌ సౌకర్యం మరిచారు
- సమస్యలు పరిష్కరించాలని కోరుతున్న వార్డు ప్రజలు


డ్రైనేజీ లేక రోడ్డు పక్కన మురుగునీరు (ఇన్‌సెట్లో) చేతిపంపు చుట్టూ మురుగునీరు

జమ్మికుంట: మున్సిపల్‌ పరిధిలోని కొత్తపల్లి నాలుగో వార్డు సమస్యలకు నిలయంగా మారింది. అంతంత మాత్రం రోడ్లు నిర్మించినప్పటికీ డ్రైనేజీలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉపఎన్నికల్లో నాయకులు హామీలు ఇచ్చినప్పటికి పనులు జరగడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీడీ కాలనీ వాసులకు రోడ్డు సమస్య తీవ్రంగా ఉంది. వర్షాకాలంలో ఇళ్లలోకి నీరు చేరుతుంది. మురుగు, వర్షం నీటితో అనారోగ్యానికి గురై ఆర్థికంగా నష్టపోతున్నామని, ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు సమస్యలపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

జమ్మికుంట మున్సిపల్‌లో విలీనం

గతంలో కొత్తపల్లి గ్రామ పంచాయతీగా ఉండేది. నాలుగేళ్ల క్రితం మున్సిపల్‌లో విలీనం చేశారు. వార్డులో అభివృద్ధి పనులు జరగడం లేదు. సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. శ్మశానవాటిక నామ మాత్రంగా నిర్మించి ప్రహరీ లేకుండా, విద్యుత్‌ సౌకర్యం ఇవ్వకుండా వదిలివేశారు. మున్సిపల్‌లో విలీనం అనంతరం వార్డు అనేక సమస్యలకు నిలయంగా మరింది.

సమస్యలు

- సీసీ రోడ్ల ఇరువైపులా డ్రైనేజీలు లేవు.
- ఆయా కాలనీలకు సీసీడ్లు నిర్మించాలి
- జనావాసాల్లో మిల్లులు నిర్వహణతో ప్రజలు డస్ట్‌తో ఇబ్బందులు పడుతున్నారు.
- ఉనుక, పురుగులు ఇళ్లలోకి రావడంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు.
- పారిశుధ్య పనుల నిర్వహణ అంతంతమాత్రమే.
- శానిటేషన్‌, బ్లీచింగ్‌ చేయకపోవడంతో విజృంభిస్తున్న దోమలు.

నాలుగో వార్డు వివరాలు

జనాభా	2,500
ఓటర్లు	1,050
నివాస గృహాలు	450

- వార్డులో రెండు పెద్ద గుంతలు వర్షం నీటితో నిండి దోమల ఉధృతికి కారణమవుతున్నాయి.

ఉప ఎన్నికల్లో ఇచ్చిన హామీలు..

- మహిళా సంఘ భవనం నిర్మాణం.
- మినరల్‌ వాటర్‌ ప్లాంట్‌ ఏర్పాటు.
- బీడీ కోటర్స్‌కు రోడ్డు నిర్మాణం.
- మిల్లుల నుచంఇ డస్ట్‌ రాకుండా రక్షణ చర్యలు.
- ముందుకు సాగని దోబీఘాట్‌ పనులు.

ఇబ్బంది పడుతున్నాం


డ్రైనేజీలు లేక ఇబ్బందులు పడుతున్నాం. వర్షాలకు రోడ్డుపై నీరు ఇళ్లలోకి చేరుతుంది. నిల్వ నీటి తో దోమలు పెరిగి రోగాల వస్తున్నాయి. తా గునీటికి పైపులైన్లువేయించాలి.

– సిరికొండ రాజయ్య, నాల్గో వార్డు, జమ్మికుంట

అనారోగ్యానికి గురవుతున్నాం


జనావాసాల్లోని మిల్లులకు గ్యాస్‌ పైపులు అమర్చడం లేదు. దుమ్ము, ధూళి రాకుండా రక్షణ చర్యలు చేపట్టడం లేదు. ఇళ్లలోకి డస్ట్‌ చేరడంతో అనారోగ్యానికి గురవుతున్నాం.

– మహ్మద్‌ గౌసొద్దీన్‌, నాలుగోవార్డు, జమ్మికుంట

సమస్యలు పరిష్కరిస్తాం


డ్రైనేజీ, సీసీరోడ్లు నిర్మించాల్సి ఉంది. ఎమ్మెల్సీ, మున్సిపల్‌ చైర్మన్‌, కమిషనర్‌ దృష్టికి సమస్యలు తీసుకువెళ్లాం. నిధులు మంజూరు చేయించి వార్డు ప్రజలు ఇబ్బందులు తొలగిస్తాం.

– ఎలగందుల స్వరూపశ్రీహరి, నాలుగోవార్డు కౌన్సిలర్‌, జమ్మికుంట

రైతులను కాపాడుకునే నాయకుడు సీఎం కేసీఆర్‌

ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి


మాట్లాడుతున్న పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్‌: వ్యవసాయానికి మూడు గంటల కరెంట్‌ చాలూ అన్న కాంగ్రెస్‌, మత పిచ్చి లేపే బీజేపీ, మూడు పంటలకు 24 గంటల కరెంట్‌ ఇస్తున్న బీఆర్‌ఎస్‌.. ఏ ప్రభుత్వం కావాలో హుజూరాబాద్‌ ప్రజలు ఆలోచన చేయాలని ప్రభుత్వ విప్‌, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. విద్యుత్‌ సరఫరాపై కాంగ్రెస్‌ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌ రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం హుజూరాబాద్‌ రైతువేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రైతులను కాపాడుకునే నాయకుడు సీఎం కేసీఆర్‌ అన్నారు. కరెంట్‌ కోసం రైతులు పడిగాపులుగాసిన రోజులు చూశామన్నారు. హుజూరాబాద్‌లో బీఆర్‌ఎస్‌ జెండా ఎగరవేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ గందె రాధిక, ఎంపీపీ రాణిసురేందర్‌ రెడ్డి, జెడ్పీటీసీ బక్కరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, పీఏసీఎస్‌ డైరెక్టర్లు, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు, బీఆర్‌ఎస్‌ నాయకులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై ఈటల కపటప్రేమ

ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ జర్నలిస్టులపై కపట ప్రేమ చూపిస్తున్నాడని కౌశిక్‌రెడ్డి విమర్శించారు. పట్టణంలోని బీఆర్‌ఎస్‌ కార్యాలయంలో మాట్లాడారు. హుజూరాబాద్‌ జర్నలిస్టులకు చేసింది ఏంటని ప్రశ్నించారు. ఇన్నేళ్లుగా ఇళ్ల స్థలాలు ఎందుకు ఇవ్వలేదో చెప్పాలన్నారు. త్వరలో హుజూరాబాద్‌ జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇస్తామని స్పష్టం చేశారు. ఎస్సీ కార్పొరేషన్‌ చైర్మన్‌ బండ శ్రీనివాస్‌, ఎంపీపీ ఇరుమళ్ల రాణి, నాయకులు పాల్గొన్నారు. హుజూరాబాద్‌ ప్రాంతానికి చెందిన పలువురికి సీఎంఆర్‌ఎఫ్‌ నుంచి మంజూరైన చెక్కులను కౌశిక్‌రెడ్డి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు.

రైతుల మొదటి శత్రువు కాంగ్రెస్‌

చొప్పదండి ఎమ్మెల్యే రవిశంకర్‌


రామడుగు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవిశంకర్‌

రామడుగు: కాంగ్రెస్‌ పార్టీ నాయకులు ఉచిత విద్యుత్‌పై కారు కూతలు కూస్తే ఖబర్దార్‌ అని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ హెచ్చరించారు. మండలంలోని గోపాల్‌రావుపేట రైతువేదికలో రైతులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయానికి మూడు గంటల కరెంట్‌ సరిపోతుందన్న కాంగ్రెస్‌కు సపోర్టు చేద్దామా, మూడు పంటలకు 24 గంటల కరెంట్‌ ఉచితంగా అందిస్తున్న సీఎం కేసీఆర్‌ కావాలో రైతులు ఆలోచన చేయాలని, రైతు రాజుగా ఎదగడం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి ఇష్టంలేదన్నారు. గతంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ ఇవ్వకుండా గోస పెట్టిందని విమర్శించారు. రైతులకు మొదటి శత్రువు కాంగ్రెస్‌ పార్టీయేనని, వ్యవసాయరంగాన్ని సర్వనాశనం చేసిందని మండిపడ్డారు. సమావేశంలో బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు గంట్ల జితేందర్‌ రెడ్డి, మండల ఎంపీటీసీల సంఘం అధ్యక్షులు ఎడవెల్లి నరేందర్‌రెడ్డి, రైతు బంధు మండల కోఆర్డినేటర్‌ జూపాక కరుణాకర్‌, కొండగట్టు దేవస్థానం సభ్యులు దాసరి రాజేందర్‌రెడ్డి, మార్కెట్‌ కమిటీ ఉపాధ్యక్షులు చాడ ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మార్కొండ కిష్టారెడ్డి, నాయకులు నెరెళ్ల అంజయ్య, బక్కశెట్టి నర్సయ్య, చాడ శేఖర్‌రెడ్డి, లక్ష్మణ్‌ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

గంగాధర: మండలంలోని గట్టుభూత్కూర్‌ గ్రామంలో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ రూ.16 లక్షల నిధులు మంజూరు చేశారు. మంగళవారం మండలంలోని బూర్గుపల్లి గ్రామంలో పనులకు సంబంధించిన ప్రొసీడింగ్‌ను సర్పంచ్‌ కంకణాల విజయేందర్‌రెడ్డి అందుకున్నారు. గ్రామంలోని వడ్డెర సంఘం, మహిళామండలి భవనం, రెడ్డిసంఘ భవనంతో పాటు, ఓపెన్‌జిమ్‌ ఏర్పాటుకు రూ. నాలుగు లక్షల చొప్పున నిధులు మంజూరు చేశారని సర్పంచ్‌ తెలిపారు.

ఎస్‌డీఎఫ్‌...

చొప్పదండి: పట్టణంలోని ఆరోవార్డు పరిధిలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ మంగళవారం రూ. 12 లక్షల ఎస్‌డీఎఫ్‌ ప్రొసీడింగ్‌లు అందించారని కౌన్సిలర్‌ వడ్లూరి గంగరాజు తెలిపారు. గాంధీనగర్‌లో యూత్‌ బిల్డింగ్‌, బ్రాహ్మణ కుంటలో ఎస్సీ శ్మశానవాటిక, సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించనున్నామని చెప్పారు. నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు గంగరాజు కృతజ్ఞతలు తెలిపారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌

చిగురుమామిడి: మండలంలో ఇప్పటివరకు 1,517 మందికి కల్యాణలక్ష్మి, 12 మందికి సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులు పంపిణీ చేశామని హుస్నాబాద్‌ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌ తెలిపారు. మంగళవారం చిగురుమామిడి రైతువేదికలో కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం ధ్యేయంగా పనిచేస్తుందని, కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ ఆడబిడ్డలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సీఎంఆర్‌ఎఫ్‌, ఆసరా పెన్షన్లు, రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత కరెంట్‌ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కొత్తవినీత, జెడ్పీటీసీ గీకురు రవీందర్‌, ఎంపీడీఓ నర్సయ్య, తహసీల్దార్‌ జీంక జయంత్‌, సింగిల్‌విండో చైర్మన్‌ జంగ వెంకట్రమణారెడ్డి, మార్కెట్‌ కమిటీ వైస్‌ చైర్మన్‌ రామోజు రజితకృష్ణమాచారి, మండల పరిషత్‌ ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, రైతుబంధు జిల్లా నాయకులు సాంబారి కొంరయ్య, రైతుబంధు మండల అధ్యక్షుడు పెనుకుల తిరుపతి, పార్టీ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని సీతారాంపూర్‌, లంబాడిపల్లి, గాగిరెడ్డిపల్లి, నవాబుపేట్‌, గునుకులపల్లి, ముదిమానిక్యం గ్రామాల్లో మంగళవారం హుస్నాబాద్‌ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్‌ నూతన గ్రామ పంచాయతీ భవనాలకు శంకుస్థాపన చేశారు. ఒక్కో గ్రామ పంచాయతీకి రూ.ఇరవై లక్షల చొప్పున మంజూరయ్యాయని తెలిపారు.

ఎమ్మెల్యేను నిలదీసిన కాంగ్రెస్‌ నాయకులు

మండలంలోని నవాబుపేట్‌లో కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, నాయకులు కరెంట్‌, రుణమాఫీ, డబుల్‌ బెడ్‌ రూం ఇళ్లపై ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌ను నిలదీశారు. నవాబుపేట్‌ జీపీ భవనానికి శంకుస్థాపన చేసి రైతు వేదికలో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. నాయకుల ప్రశ్నలను ఎమ్మెల్యే ఓపిగ్గా విన్నారు.

రాష్ట్ర అభివృద్ధే ప్రభుత్వ ఎజెండా

మానకొండూర్‌ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌


తిమ్మాపూర్‌: ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే రసమయి

మానకొండూర్‌: రాష్ట్ర అభివృద్ధే ప్రధాన ఎజెండగా ప్రభుత్వం ముందుకుసాగుతుందని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ అన్నారు. మండలంలోని సదాశివపల్లి గ్రామంలో రూ. 51 లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను సుడా చైర్మన్‌ జీవీ రామకృష్ణారావు, కరీంనగర్‌ మేయర్‌ సునీల్‌రావు, కార్పొరేటర్‌ పద్మప్రకాశ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ... పట్టణాలు, గ్రామాల్లో బురదరోడ్లు లేకుండా పోయాయని, ఏ వీధికి వెళ్లిన సీసీరోడ్లు దర్శనమిస్తున్నాయని అన్నారు. అభివృద్ధికి పాటుపడుతున్న ప్రభుత్వానికి ప్రజల మద్దతు మెండుగా ఉందని, రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ పృథ్విరాజ్‌, నాయకులు, పాల్గొన్నారు.

మన్నెంపల్లికి మహర్దశ

తిమ్మాపూర్‌: మండలంలోని మన్నెంపల్లి గ్రామానికి మహర్దశ రానుందని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ అన్నారు. గ్రామంలో రూ.50 లక్షలతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు మంగళవారం రసమయి శంకుస్థాపన చేశారు. ముందుగా ఎమ్మెల్యేకు సర్పంచ్‌ మేడి అంజయ్య, ఉపసర్పంచ్‌ పొన్నం అనిల్‌గౌడ్‌ స్వాగతం పలికారు. గ్రామంలోని అంబేడ్కర్‌ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ పంచాయతీ భవనం మిగులు పనులు ప్రారంభించారు. మైనారిటీ సంఘ భవనానికి భూమిపూజ చేశారు. అంబేడ్కర్‌ సంఘ భవనం ప్రహరీ, మాల సంఘం భవనానికి భూమిపూజ, శాలివాహన కుమ్మరి సంఘం భవనం ప్రారంభోత్సవం చేశారు. మహిళా సంఘ భవనం ఆవరణలో మొక్కలు నాటారు. బీఆర్‌ఎస్‌ పాలనలో రాష్ట్రంలోని ప్రతీ గ్రామం అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయన్నారు. పంచాయతీల అభివృద్ధికి పల్లె ప్రగతిలో ప్రతినెల నిధులు మంజూరు చేస్తున్నామని, దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. ప్రతి పల్లెలో పార్క్‌, ప్రకతివనం, వైకుంఠధామం, సామూహిక మరుగుదొడ్లు, సీసీరోడ్లు, ఎల్‌ఈడీ లైట్లు ఇవన్నీ కళ్ల ముందే కనిపిస్తున్నాయన్నారు. 60 ఏళ్లలో జరగని అభివృద్ధి తొమ్మిదేళ్లలో జరిగిందన్నారు. ప్రతీ ఇంటికీ మిషన్‌ భగీరథ ద్వారా తాగునీరు అందుతోందని, 24 గంటల ఉచిత విద్యుత్‌ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ కనుకయ్య, మండల అధ్యక్షుడు రమేశ్‌, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షులు ఇనుకొండ జితేందర్‌ రెడ్డి, బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకులు దేవేందర్‌ రెడ్డి,, ఆత్మకమిటీ చైర్మన్‌ అశోక్‌ రెడ్డి, ఎంపీడీవో రవీందర్‌ రెడ్డి, నాయకులు అశోక్‌, జలపతి, శ్రీనివాస్‌ గౌడ్‌, మాజీ ఎంపీపీ ప్రేమలత, వార్డు సభ్యులు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

గ్రామంలో నూతన మహిళా సంఘం భవనాన్ని పాత గ్రామ పంచాయతీలోనే ఏర్పాటు చేయాలని మహిళా సంఘం నాయకులు ఎమ్మెల్యే రసమయిని కోరారు. ఈ క్రమంలో కొందరు మహిళలు వాగ్వాదానికి దిగారు. ఎమ్మెల్యే సమాధానం ఇచ్చి బయలుదేరారు.

నాటు వేసి నిరసన


నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

గన్నేరువరం: గన్నేరువరం నుంచి పొత్తూర్‌ వరకు డబుల్‌ రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడాన్ని నిరసిస్తూ బీజేపీ నాయకులు మంగళవారం గుండ్లపల్లి నుంచి కొండాపూర్‌ వరకూ వర్షంలో తడుస్తూ రోడ్డుపై నాటు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మానకొండూర్‌ నియోజకవర్గ కన్వీనర్‌ ముత్యాల జగన్‌రెడ్డి మాట్లాడారు. ప్రజలు మొన్నటివరకు రహదారిపై దుమ్ము ధూళితో ఇబ్బందులు పడితే ఇప్పుడు గుంతలు, బురదతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణం చేపట్టకపోతే మండలంలో తిరగనివ్వం ఎక్కడివెళ్లిన అడ్డుకుంటామని ఎమ్మెల్యేను హెచ్చరించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు సుమిత్‌రెడ్డి, పర్శరామ్‌, సోషల్‌ మీడియా కన్వీనర్‌ మురళీకృష్ణ, హరీశ్‌, తిరుపతి, అజయ్‌, అరవింద్‌ రాకేశ్‌, సంతోష్‌, సాగర్‌, రాజ్‌కుమార్‌, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మల దహనం

మానకొండూర్‌: జగిత్యాలలో మంత్రి కేటీఆర్‌ రాహుల్‌ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా మంగళవారం కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు రవీంద్రాచారి ఆధ్వర్యంలో కేటీఆర్‌ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం గన్నేరువరంలో కాంగ్రెస్‌ పార్టీ నాయకులను ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ పోలీసులతో అరెస్టు చేయించనందుకు రోడ్డుపై ధర్నా నిర్వహించారు. అరెస్ట్‌ చేసిన వారిని విడుదల చేయాలని డిమాండ్‌ చేశారు.

జమ్మికుంట: పట్టణంలోని ఫ్లై ఓవర్‌ బ్రిడ్జి జంక్షన్‌ వద్ద కాంగ్రెస్‌ నాయకులు సీఎం కేసీఆర్‌ దిష్టి బొమ్మను ఉరితీసి దహనం చేశారు. కాంగ్రెస్‌ కిసాన్‌ సెల్‌ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. విద్యుత్‌పై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను వక్రీకరించారని ఆరోపించారు. ఏ పార్టీకి ఓటు వేయాలో ప్రజలు నిర్ణయిస్తారని అన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ పార్టీ ప్రతిపక్ష పాత్ర పోషిస్తుందని ఆరోపించారు. హద్దుమీరి ప్రవర్తిస్తే ఖబడ్దార్‌ అని హెచ్చరించారు.

హుజూరాబాద్‌: వీణవంక మండలంలో బీఆర్‌ఎస్‌ నాయకులు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తూ చేసిన హేయమైన చర్యకు నిరసనగా మంగళవారం కాంగ్రెస్‌ నాయకులు స్థానిక అంబేడ్కర్‌ చౌరస్తా వద్ద ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ శవయాత్ర నిర్వహించారు. అనంతరం ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌ ఆదేశానుసారం కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.


మానకొండూర్‌లో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

సైన్స్‌తోనే సమాజం అభివృద్ధి

చిగురుమామిడి: మంత్రాలు, తంత్రాలు బూటకమని, సైన్స్‌తోనే సమాజం అభివృద్ధి చెందుతుందని భారత నాస్తిక సమాజం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పులేటి నరేశ్‌ అన్నారు. మంగళవారం మండలంలోని బొమ్మనపల్లి జిల్లా పరిషత్‌ పాఠశాలలో వ్యక్తిత్వ వికాసం–మూఢనమ్మకాల నిర్మూలన అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థి దశలోనే తల్లిదండ్రులను చైతన్యం చేయాలని కోరారు. ఈసందర్భంగా సైన్స్‌ మ్యాజిక్‌ షో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజమౌళి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● పరామర్శ

హుజూరాబాద్‌రూరల్‌ : మండలంలోని సింగాపూర్‌ మాజీ ఎంపీటీసీ ఈరెల్లిసమ్మయ్య సమ్మయ్య తండ్రి ఈరెల్లి మొండయ్య ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని మంగళవారం ఎస్సీ కార్పొరేషన్‌ చైర్మన్‌ బండ శ్రీనివాస్‌ పరామర్శించారు.

● కూలిన పాత ఇళ్లు

సైదాపూర్‌: మండలంలోని రాములపల్లిలో మంగళవారం కురిసిన వర్షానికి పాత ఇళ్లు కూలిపోయాయి. 46.8 మీ.మీ వర్షాపాతం నమోదైందని అధికారులు తెలిపారు. రాములపల్లిలో పనికెల మొగిలయ్య ఇల్లు కూలింది. మండలంలోని పలు గ్రామాల్లో కూడా పాత ఇళ్లు, పశువుల కొట్టాలు పాక్షికంగా కూలిపోయాయి.

● ఎన్నికల ప్రక్రియపై అవగాహన

గంగాధర: మండలంలోని మధురానగర్‌ విన్నర్స్‌ ఎడ్జ్‌ స్కూల్‌లో విద్యార్థులకు ఎన్నికలు నిర్వహించి స్కూల్‌ హెడ్‌ బాయ్‌, గర్ల్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా స్కూల్‌ చైర్మన్‌ మల్లయ్య ఎన్నికల ప్రక్రియపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెడ్‌ బాయ్‌గా వై.రంజిత్‌, హెడ్‌ గర్ల్‌గా జి.అనన్య ఎన్నికయ్యారు.

● విద్యుత్‌ సరఫరా తీరు పరిశీలన

రామడుగు: మండలంలోని షానగర్‌ విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ను మంగళవారం టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్‌ రాష్ట్ర కన్వీనర్‌ వెన్న రాజమల్లయ్య సందర్శించారు. ఈసందర్భంగా విద్యుత్‌ సరఫరా తీరు, రికార్డులను పరిశీలించారు. కాంగ్రెస్‌ పార్టీ రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని, 24 గంటల విద్యుత్‌ సరఫరాకు కాంగ్రెస్‌పార్టీ కట్టుబడి ఉందన్నారు.

● ఆర్థికసాయం

జమ్మికుంట: పట్టణంలోని 22వ వార్డు బీఆర్‌ఎస్‌ అధ్యక్షుడు మంద రాజేష్‌ అదే వార్డులోని నిరుపేద కుటుంబానికి చెందిన ఇమ్మడి రాజేశ్‌ అనారోగ్యానికి గురికాగా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని రూ. మూడువేల ఆర్థికసాయం అందజేశారు.

పంచాయతీ కార్మికుల భిక్షాటన, అర్ధనగ్న ప్రదర్శన


భిక్షాటన చేస్తున్న కార్మికులు


కేశవపట్నంలో జీపీ సిబ్బంది అర్ధనగ్న ప్రదర్శన


ఒంటికాలిపై నిల్చొని కార్మికుల నిరసన

మానకొండూర్‌రూరల్‌: రాష్ట్ర ప్రభుత్వం న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని వివిధ గ్రామాల జీపీ కార్మికులు ఎంపీడీవో కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్నారు. మంగళవారం పల్లెమీద చౌరస్తా, వీధులవెంట, కిరాణ షాపుల్లో భిక్షాటన చేశారు. 20న కలెక్టర్‌ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపడతామని, మండలంలోని కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని జీపీ కార్మికుల మండల అధ్యక్షుడు అంజయ్య పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రమేశ్‌, శ్రీనివాస్‌, రాజ్‌కుమార్‌, అంజన్‌కుమార్‌, అకీమ్‌ పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో జీపీ సిబ్బంది చేపట్టిన సమ్మె 13వరోజుకు చేరింది. మంగళవారం గ్రామ పంచాయతీ కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేశారు. వర్షంలో సైతం ఓ దుకాణం ఎదుట కూర్చుండి నిరసన తెలిపారు. కార్యక్రమంలో మల్లేశం, సురేశ్‌, తిరుపతిరావు పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మె మంగళవారంతో 13వ రోజుకు చేరుకుంది. సమ్మెలో పాల్గొన్న కార్మికులు ఒంటికాలిపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రవీందర్‌రావు, అప్పాల సారయ్య, ముత్యాల పర్శరాములు, సతీష్‌, తిరుపతి, భద్రయ్య, సారయ్య, రాజన్న పాల్గొన్నారు.